
సోమల మండలం కమ్మపల్లెలో పూర్తయిన షెడ్డు నిర్మాణం


నగరి మండలం ఆయనంబాకంలో షెడ్డు కోసం తీస్తున్న పునాదులు


రామకుప్పం మండలం బందార్లపల్లెలో నిర్మాణంలో ఉన్న షెడ్డు

# నిధులున్నా నిర్లక్ష్యమే

గోకులం షెడ్ల నిర్మాణంలో అధికారుల అలసత్వం

2327 గోకులం షెడ్లు మంజూరైతే పూర్తయినవి 34

చిత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు గోకులం షెడ్ల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించింది. జిల్లాలో ఒక్కటంటే ఒక్కటీ నిర్మించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం చర్యలు చేపట్టింది. గ్రామాల్లో పశుపోషణ, కోళ్ల, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ.. పెంపకం దార్లను ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలోనే 90శాతం రాయితీతో గోకులం షెడ్లను మంజూరు చేసింది. పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే అక్కడ గోకులం షెడ్లను నిర్మించుకోవచ్చు.

సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రంలోనే అత్యధికంగా మన జిల్లాకు 2327 గోకులం షెడ్లు మంజూరు చేశారు.షెడ్ల నిర్మాణానికి రూ.50.99 కోట్ల నిధుల్ని విడుదల చేశారు. షెడ్డు నిర్మించిన వెంటనే బిల్లులు విడుదలయ్యే సౌకర్యాన్ని కల్పించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అర్హుల్ని గుర్తించి లబ్ధిదారుల జాబితా తయారుచేశారు. నిర్మాణాలను పూర్తి చేయడంలో క్షేత్రస్థాయి అధికారులు అలసత్వం వహిస్తున్నారు. పశుసంవర్ధక శాఖ సహాయకులు, ఉపాధిహామీ సిబ్బంది సమన్వయంతో నిర్మాణాల్లో వేగాన్ని పెంచాల్సి ఉంది. 2327 నిర్మాణాల్లో కేవలం 34 మాత్రమే పూర్తయ్యాయంటే పరిస్థితి అర్థమవుతోంది.

జిల్లాకు మంజూరైన షెడ్లు: 2327
విడుదలైన నిధులు: రూ.50.99 కోట్లు
జియో ట్యాగింగ్ పూర్తయినవి: 1977
పనులు ప్రారంభమైనవి: 980
నిర్మాణం పూర్తయినవి: 34

**● పెద్దఎత్తున రాయితీ**

గోకులం షెడ్లను నిర్మించుకునే వారికి ప్రభుత్వం పెద్దఎత్తున రాయితీ ఇస్తోంది. పెంపకందార్లు నామమాత్రంగా తమ వాటా వేసుకుంటే పశువులకు ఉపయోగపడే షెడ్లను నిర్మించుకోవచ్చు. పశువుల పెంపకందార్లకు 90 శాతం.. గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందార్లకు 70 శాతం చొప్పున రాయితీ ఇస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డున్న చిన్న, సన్నకారు రైతులు దీనికి అర్హులు.

**● రాయితీ వివరాలు**

| షెడ్డు పరిధి | యూనిట్ విలువ | రాయితీ | రైతు వాటా |
|---|---|---|---|
| 2 పశువులు | రూ.1,15,000 | రూ.1,03,500 | రూ.11,500 |
| 4 పశువులు | రూ.185,000 | రూ.166,500 | రూ.18,500 |
| 6 కన్నా ఎక్కువ ఉంటే | రూ.230,000 | రూ.207,000 | రూ.23,000 |
| 20 గొర్రెలు, మేకలు | రూ.230,000 | రూ.91,000 | రూ.39,000 |
| 50 గొర్రెలు, మేకలు | రూ.230,000 | రూ.161,000 | రూ.69,000 |
| 100 కోళ్లు | రూ.87,000 | రూ.60,900 | రూ.26,100 |
| 200 కోళ్లు | రూ.132,000 | రూ.92,400 | రూ.39,600 |

**● మండలాల పురోగతి ఇదీ**

28 మండలాల్లో 2327 షెడ్లను మంజూరు చేయగా.. కుప్పంలో 15, గుడుపల్లెలో 8, శాంతిపురంలో 8, సోమల, కార్వేటినగరం,విజయపురం మండలాల్లో ఒకటి చొప్పున నిర్మాణాలు పూర్తయ్యాయి. అంటే 34 షెడ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన మండలాల్లోనూ నిర్మాణాలు ప్రారంభించారు.కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని షెడ్ల నిర్మాణాల్లో పురోగతి ఉంది. బైరెడ్డిపల్లెలో అత్యధికంగా 220 షెడ్లు మంజూరైతే, కేవలం 37 మాత్రమే గ్రౌండ్ అయ్యాయి.ఒక్కటీ పూర్తి కాలేదు.అలాగే, పూతలపట్టు మండలంలో 64మంజూరైతే, 9 ప్రారంభమయ్యాయి.

# కంగుంది..@

## ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో భాగస్వాములౌతున్న మహిళలకు మరింత తోడ్పాటు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి.ఇందులో భాగంగా మహిళా స్నేహపూర్వక పంచాయతీల (ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేసేందుకు సిద్ధమయ్యాయి. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలో జిల్లాకు ఒకటి చొప్పున 26 పంచాయతీలను ఎంపిక చేశారు. అందులో చిత్తూరు జిల్లా నుంచి కుప్పం మండలంలోని 'కంగుంది' పంచాయతీని ఎంపిక చేశారు.ఈ కార్యక్రమం కింద అభివృద్ధి పనులకు కేంద్రం ప్రత్యేకంగా నిధులందించే అవకాశం ఉంది.మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా వారి భాగస్వామ్యంతో పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు సమకూరుస్తారు.మహిళలకు విద్య వైద్యం, స్వయం ఉపాధి వంటి పథకాల అమలుకు పెద్దపీట వేస్తారు. ఇళ్ల నుంచి విధిగా చెత్తసేకరణ, ఘనవ్యర్థాల నిర్వహణకు ప్రాముఖ్యం ఉంటుంది.బాల్య వివాహాలు, శిశుమరణాల నియంత్రణకు చర్యలు చేపడతారు. వ్యసనాలు లేని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతారు. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా ఎంపికైన కంగుంది గ్రామ పంచాయతీలో 12మంది వార్డుసభ్యులుండగా వారిలో ఐదుగురు మహిళలున్నారు. సర్పంచ్‌గా చంద్రశేఖర్ వ్యవహరిస్తున్నారు.




# మా బాధలెవరికి చెప్పుకోవాలి?

● మమ్మల్ని పట్టించుకోకుండా వైసీపీ నేతలను ఎమ్మెల్యే ఎందుకు చేర్చుకుంటున్నారు? ● టీడీపీ సమావేశంలో వాగ్వాదాలపర్వం

గంగాధరనెల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కష్టపడిన నేతలను ఎమ్మెల్యేనే పట్టించుకోకుంటే తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలని పలువురు టీడీపీ నేతలు ధ్వజమెత్తారు.గంగాధరనెల్లూరులో టీడీపీ సభ్యత్వ నమోదుపై మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది.సభ్యత్వ నమోదులో వెనుకబడ్డామని, ఇకనైనా అందరూ కలసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.టీడీపీ కార్యకర్తలు, నేతలు సహకరిస్తేనే సభ్యత్వ నమోదులో ముందుకెళ్లగలమని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు నేతలు సభ్యత్వం కథ తరువాత... మాకు గౌరవం ఇవ్వకపోతే మేమెందుకు పార్టీకోసం పనిచేయాలని స్టేజీమీద ఉన్న నేతలతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల ప్రచార సమయంలో నేతల గౌరవానికి లోటుండదని చెప్పిన థామస్ ఎమ్మెల్యేగా గెలిచాక పట్టించుకోవడం లేదని వాపోయారు.ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు వైసీపీ నేతలు టీడీపీలో చేరడానికి వస్తే ఏ గ్రామానికి చెందిన వారికి అక్కడి టీడీపీ నేతలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాకే చేర్చుకుంటామని చెప్పారని, కాబట్టే తాము అప్పుడు అభ్యంతరం చెప్పలేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎవరితో అయితే ప్రాణాలకు తెగించి పోరాడామో వారే ఇప్పుడు టీడీపీలో చేరడానికి క్యూ కడుతున్నారని, స్థానిక నేతలకు ఎటువంటి సమాచారం లేకుండా ఎమ్మెల్యే థామస్ చేర్చుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.ఎమ్మెల్యే థామస్ వారినే స్టేజిపై కూర్చొబెట్టుకుంటున్నారని వాపోయారు. టీడీపీ నేతలను గతంలో వేధించిన పోలీసులే ఇంకా చెలామణి అవుతుండడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.ఇప్పటికీ వైసీపీ నేతలకే పనులు జరుగుతున్నాయని,అధికారులు తమను మతించడం లేదని ధ్వజమెత్తారు. 2014లో టీడీపీ నేతలు చేసిన పనులకు ఇంకా బిల్లులు మంజూరు కాలేదని, ఇంజనీరింగ్ అధికారుల వద్ద ప్రస్తావిస్తే చేయలేమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వేదికపై వున్న నాయకులు వారు చెప్పిన విషయాలను నోట్ చేసి సంతకాలు చేయించుకుని వాటిని టీడీపీ కేంద్ర కార్యాలయానికి, మంత్రి నారా లోకేశ్‌కు పంపిస్తామని సర్ది చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నెల్లేపల్లె మాజీ సర్పంచ్ పుష్పరాజ్, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేదికపై వున్న నేతలను నిలదీస్తున్న టీడీపీ శ్రేణులు

## కన్నులపండువగా వినాయక కల్యాణం


వధూవరులకు హారతి

ఐరాల(కాణిపాకం),నవంబరు20(ఆంధ్రజ్యోతి):కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో కార్తీక బహుళ శుద్ధ పంచమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు.అలంకార మండపం వద్ద సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లకు అర్చకులు పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. వైసీపీ నేత పోకలఅశోక్‌కుమార్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం వినాయక స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అణివేటి మండపం, సువద మండపం, ప్రధాన ఆలయాన్ని పూర్తిగా పుష్పాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు.వివాహానంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లను పల్లకిపై ఉంచి బాజాభజంత్రీలు వాయిస్తూ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆ నలుగురి అరెస్టు వెనుక..


కర్ణాటక రాష్ట్రం హోసనహల్లిలో శివకుమార్ కోసం మారువేషాల్లో చిత్తూరు పోలీసులు

చిత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో నుంచి బంగారు గొలుసుల్ని దొంగలించే నలుగురిని పోలీసులు అరెస్టు చేయడం వెనుక 20 రోజుల శ్రమ దాగి ఉంది. నిందితుల్లో ఏ1 శివకుమార్ పీజీ కంప్యూటర్స్ చదివాడు.పోలీసులను మించిన సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండడంతో పట్టుకోవడం పోలీసులకు కష్టంగా మారింది. చిత్తూరు- పీలేరు ప్రధాన రహదారిపై అక్టోబరు 26వ తేదీన 15 నిమిషాల వ్యవధిలో మూడు దొంగతనాలు జరిగాయి. ఓ మహిళ మెడలో నుంచి చైను లాగే ప్రయత్నంలో ఆమె కింద పడి, ఆ తర్వాత చికిత్స పొందుతూ మరణించింది కూడా. వరుస దొంగతనాలు, మహిళ మృతి.. పోలీసులకు ఓ రకంగా అవమానకరంగా మారింది. దీంతో స్పెషల్ బ్రాంచి, క్రైమ్ పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి అక్టోబరు 30 నుంచి నిందితుల్ని వెతకడం ప్రారంభించారు.

**● ఆరేళ్లుగా దొరకని శివకుమార్**

ప్రధాన నిందితుడు శివకుమార్ సొంతూరు.. కర్ణాటక రాష్ట్రం, రామ్‌నగర జిల్లా కనకపుర తాలూకా ముళ్లహల్లి గ్రామం. అది అటవీ ప్రాంతంలో ఉండడంతో ఈ ప్రాంతానికి పోలీసులు వెళితే శివకుమార్‌కున్న నెట్‌వర్క్ వల్ల ముందుగానే తెలిసిపోతోంది.ఇతనిపై దక్షిణాది రాష్ట్రాల్లో 40 వరకు కేసులున్నాయి. 22 కేసుల్లో అరెస్టు పెండింగు ఉంది. ఆరేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారాన్ని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పోలీసులు ఛేదించలేకపోయారు. శివకుమార్ 18ఏళ్ల యువకుల్ని పట్టుకుని వారికి మొదట గంజాయి అలవాటు చేస్తాడు. స్పోర్ట్స్ బైకుల్ని దొంగలించడం, వాటిపై వేగంగా వెళుతూ మహిళల మెడలో చైన్లను లాక్కెళ్లడం.. అంశాల్లో శిక్షణ ఇస్తాడు. దొంగతనం జరిగే ప్రదేశంలో తను లేకుండా చూసుకుంటాడు.శిక్షణ ఇచ్చిన యువకులు ముందు బైకులో వెళుతుండగా వెనుక కారులో ప్రయాణిస్తూ శివకుమార్ వారికి డైరెక్షన్ ఇస్తుంటాడు.కాబట్టే ఏ సీసీ కెమెరాలోనూ కన్పించడు.

### లింకు దొరికిందిలా..

మూడు దొంగతనాలూ చేసింది బైకులో యువకులు. ఎక్కడా ప్రధాన నిందితుడు శివకుమార్ కనిపించలేదు. కానీ, ఆ బైకు వెనుక ఓ కారు ప్రతిసారీ ఫాలో అవుతోంది. పూతలపట్టు నుంచి మన రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన నంగిలి వరకు చూసిన సీసీ కెమెరాల్లో ఆ బైకు వెంట ఓ కారు ఫాలో అవుతున్న విషయాన్ని గమనించిన పోలీసులు.. ఆ కోణంలో ఆరా తీశారు. టెక్నికల్ అనాలసిస్ లో శివకుమార్ ఆరేళ్లుగా పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్నాడని కర్ణాటక పోలీసులు చెప్పారు.

### పొరుగు రాష్ట్రాల ఎస్పీల ప్రశంసలు

కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో కేసులున్నా.. ఆరేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న శివకుమార్‌ను చిత్తూరు పోలీసులు పట్టుకోవడంపై ప్రశంసలు లభించాయి. ఆ రెండు రాష్ట్రాల్లోని రామ్‌నగర, మైసూరు, హోసూరు, బెంగళూరు రూరల్ ఎస్పీలు చిత్తూరు ఎస్పీ మణికంఠకు ఫోన్ చేసి ప్రశంసించారు. రిమాండు ముగిసిన తరువాత తమకు అప్పగిస్తే.. మా కేసుల్లో మళ్లీ అరెస్టు చేసుకుంటామని చెప్పారు.

**● రెండు సార్లు తప్పించుకున్న వైనం**

చిత్తూరు పోలీసులు సుమారు 20 రోజులు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో శివకుమార్ కోసం గాలించారు. శివకుమార్ ఓ రోజు పడుకున్న ప్రదేశంలో మరో రోజు పడుకోడు. రాత్రిళ్లు పడుకోవడానికి గదులు అద్దెకు తీసుకోడు. గ్రామీణ ప్రాంతాల్లోనే తల దాచుకుంటాడు.సెల్‌ఫోన్ వాడడు. బ్యాంకు అకౌంట్లు, సోషల్ మీడియా అకౌంట్లు లేవు. టోల్‌గేట్లను తప్పించుకుని ప్రయాణిస్తూ ఉంటాడు. దీంతో చిత్తూరు పోలీసుల బృందానికి రెండుసార్లు శివకుమార్ కనిపించినా.. వేగంగా కారు డ్రైవ్ చేసి తప్పించుకున్నాడు.

**● అష్టకష్టాలు పడిన పోలీసులు**

శివకుమార్‌ను పట్టుకోవడానికి వెళ్లిన స్పెషల్ బ్రాంచి బృందంలో సీఐ భాస్కర్, ఎస్‌ఐ అనిల్‌కుమార్, కానిస్టేబుళ్లు వేణు, రవి, క్రాంతి, నటరాజ్, సుబ్రమణ్యం.. క్రైమ్ బృందంలో సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్‌ఐ నరసింహులు, కానిస్టేబుళ్లు గురురాజ్, గణేష్, పురుషోత్తం, స్రవంత్ ఉన్నారు. వీళ్లంతా అక్టోబరు 30 నుంచి నవంబరు 19 వరకు హోసూరు, మైసూరు, బెంగళూరు, దొడ్డబల్లాపూర్, ధర్మపురి, సేలం ప్రాంతాల్లో.. కొన్నిసార్లు వేర్వేరుగా, మరికొన్నిసార్లు కలిసి తిరిగారు.చివరకు నిందితుడి సొంతూరు ముళ్లహల్లి గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో పాడుబడిన గెస్ట్‌హౌసులో మకాం వేశారు. సుమారు వారం రోజుల పాటు అక్కడే ఉండి వండుకుని తింటూ.. అక్కడి కదలికల్ని గమనించేవారు. శివకుమార్ కోసం రాత్రిళ్లు విడతలవారీగా మేల్కొని ఉన్నారు. అతన్ని అరెస్టు చేసే 48 గంటల ముందుగా పోలీసు బృందాల్లో ఎవ్వరికీ నిద్ర లేదు. ఎస్‌ఐ అనిల్‌కుమార్ గుండె నొప్పితో.. మరో పోలీసు దగ్గు, జలుబుతో ఇబ్బంది పడ్డారు. చివరకు శివకుమార్ సహా, అతని బ్యాచ్ ముగ్గుర్నీ అరెస్టు చేశారు. బుధవారం ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. చిత్తూరు పోలీసులు ఇచ్చిన సమాచారంతో మైసూరు జిల్లా పోలీసులు ఐదవ నిందితుడు అబ్బు అలియాస్ పరశురామ్‌ను అరెస్టు చేశారు. అక్కడి పోలీసుల అనుమతితో చిత్తూరు పోలీసులు విచారణ కోసం తీసుకురానున్నారు.

## నలుగురు గొలుసు దొంగల అరెస్టు

● 53 గ్రాముల బంగారం, కారు, ద్విచక్ర వాహనాల స్వాధీనం


నిందితులను చూపిస్తున్న ఎస్పీ మణికంఠ తదితరులు

చిత్తూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులను అపహరించే కర్ణాటకకు చెందిన ముఠాను చిత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 53 గ్రాముల బంగారం, ఓ కారు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.వివరాలను బుధవారం ఏఎస్పీ రాజశేఖర బాబు, డీఎస్పీ సాయినాథ్, క్రైమ్ పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ మణికంఠ చిత్తూరులో మీడియాకు వివరించారు.కేసును ఛేధించిన పోలీసులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎస్పీ కథనం మేరకు... గత నెల 26వ తేదీన పూతలపట్టు, ఐరాల మండలాల పరిధిలో 15 నిమిషాల వ్యవధిలో మూడు దొంగతనాలు జరిగాయి.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక,తమిళనాడుకు కూడా వెళ్లి దొంగల ముఠా గురించి వివరాలను సేకరించారు.ఈ క్రమంలో తిరుపతి- బెంగళూరు జాతీయ రహదారిలోని పలమనేరు మండలం జగమర్ల క్రాస్ వద్ద కర్ణాటక రాష్ట్రం,రామ్‌నగర జిల్లా కనకపుర తాలూకా ముళ్లహల్లి గ్రామానికి చెందిన శివకుమార్(36), చంద్రశేఖర్(40), జేపీ నగర్‌కు చెందిన సయ్యద్ రేహాన్(19), బనశంకరిలోని కనకపుర మెయిన్ రోడ్డుకు చెందిన కుమార్(19)లను అదుపులోకి తీసుకున్నారు.మరో నిందితుడైన పరశురామ్‌ను కర్ణాటక రాష్ట్రం దొడ్డబల్లాపూర్‌కు చెందిన పోలీసులు అరెస్టు చేశారు.ఈ సమావేశంలో ఎస్‌బీ సీఐ భాస్కర్, క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్‌బీ ఎస్‌ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



## ఆగమోక్తంగా అంగుళీ సంధాన సంప్రోక్షణం

శ్రీవారి ఆలయంలో బుధవారం సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2021లో శ్రీరాముని విగ్రహంలో ఎడమచేయి మధ్య వేలిభాగంలో చిన్నపాటి భిన్నం ఏర్పడింది. అప్పట్లో దీనికి బంగారు కవచాన్ని తొడిగి సవరించారు. సాధారణంగా ఇలాంటివి జరిగితే 12 ఏళ్లకోసారి సంప్రోక్షణం చేయడం ఆనవాయితీ. 2018లో టీటీడీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మళ్లీ 2030లోనే సంప్రోక్షణ జరగాల్సి ఉంది. కానీ విగ్రహానికి జరిగిన లోపాన్ని సవరించేందుకు అప్పటివరకూ వేచిఉండకుండా ముందుగానే చేపట్టాలని జీయర్‌స్వాములు, ఆగమ సలహాదారులు, అర్చకుల కమిటీ సూచించింది. వారి సలహా మేరకు మంగళ, బుధవారాల్లో అంగుళీ సంధాన సంప్రోక్షణను ఆగమోక్తంగా నిర్వహించారు. బుధవారం హోమం నిర్వహించారు. జీయర్ స్వామి సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు పూజలు చేశారు.

- తిరుమల(ఆంధ్రజ్యోతి)



## జిల్లాకు ఆరుగురు డీఎస్పీల రాక

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఆరుగురిని నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జె.రాంబాబును చిత్తూరు జిల్లా పోలీసు శిక్షణ కళాశాలకు, షేక్ బజీజాన్ సైదాను చిత్తూరు 8వ బెటాలియన్ డీఎస్పీగా, వి.శ్రీనివాసరెడ్డిని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు, జీవీ కృష్ణారావును చిత్తూరు 8వ బెటాలియన్‌కు, విజయానంద్‌ను వెంకటగిరిలోని 9వ బెటాలియన్‌కు, షరీఫ్‌ను తిరుపతిలోని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు నియమించారు. త్వరలో వారికి కేటాయించిన స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.





# తెల్లావారకముందే.. పల్లె లేచింది!





పల్లె అందాలు పనిపాటలతో పెనవేసుకుని ఉంటాయి. పనులకాలంలో చెట్టూచేమా.. పరిసరాలన్నీ పచ్చదనంతో కళకళలాడితే, మనుషుల ముఖాల్లో సంతోషం, సంతృప్తీ పొంగిపొరలుతుంటాయి. అడపాదడపా కురుస్తూనేవున్న వానలతో తిరుపతి జిల్లాలో వ్యవసాయ పనులు జోరుగా మొదలయ్యాయి. చెరువుల్లోకి కొత్త నీళ్లు చేరాయి. వంకలు పారుతున్నాయి. తెల్లవారకముందే రైతులూ, రైతు కూలీలూ పనిముట్లతో బయలుదేరుతున్నారు. 'అన్నా..వదినా.. మామా..బావా.. పిల్లా..' అంటూ చతుర్లాడుకుంటూ పొలాల్లోకి దిగుతున్నారు. ఒకవైపు నారు పెరికి కట్టలు కడుతున్నారు.. మరొకవైపు అడుసుదున్ని మడులను సిద్ధం చేస్తున్నారు.. ఇంకోవైపున నాట్లేస్తున్నారు. ముందస్తుగా నాటి ఏపుగా పెరిగిన పైర్లలో మందులు చల్లుతున్నారు.. పురుగూ పుట్రా ఏరుకుతింటూ రైతునేస్తాలు కొంగలు గుంపులుగా ఎగురుతూ వాలుతూ కనువిందు చేస్తున్నాయి. బుధవారం ఇంకా మంచు తెరలు వీడని వేకువ వేళ.. తిరుపతి సమీపంలోని అన్నాసాంపల్లి పరిసరాల్లోని ఈ అందాలను ఆంధ్రజ్యోతి తిరుపతి ఫోటోగ్రాఫర్ ఫోటో పట్టి అందిస్తున్నారు..



















వ్యాపారితో మాట్లాడుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

## వ్యాపారుల లైసెన్సుల డిజిటలైజేషన్

- టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వ్యాపారుల లైసెన్సులను డిజిటలైజేషన్ చేసి దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ఒకే లైసెన్స్‌తో రెండు మూడు ప్రాంతాల్లో వ్యాపారాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అనధికారికంగా వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. డీఎంబీ రోడ్డులోని అన్నపూర్ణ హోటల్ భవనాన్నిఆయన పరిశీలించారు. దుకాణాల లైసెన్సులను తనిఖీ చేశారు. ఓ టీ దుకాణంలో టీ తాగి ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. అన్నపూర్ణ హోటల్ శిథిలావస్థకు చేరుకోవడంతో పరిశీలించామన్నారు. ఇంజినీరింగ్ అధికారుల నివేదిక ఆధారంగా త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిప్యూటీఈవో ఆశాజ్యోతి, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్, రెవెన్యూ ఏఈవో భాస్కర నారాయణ చౌదరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గరుడాచలం నుంచీ అరుణాచలానికి

- సంస్కృత వర్సిటీ విద్యార్థి ఆచూకీ లభ్యం



కశ్యప ఆదిత్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి కశ్యప ఆదిత్య ఆచూకీని పోలీసులు గుర్తించారు. యూనివర్సిటీలోని గరుడచాలం హాస్టల్‌లో వసతి పొందుతున్న ఇతడు.. కనిపించడం లేదంటూ పోలీసులకు కుటుంబీకులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. హాస్టల్‌లోనే ఫోన్, గుర్తింపు కార్డు వదిలిపెట్టి వెళ్లారు. అరుణాచలం నుంచీ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసినట్టు పోలీసులు తెలిపారు. దీంతో విద్యార్థి కశ్యప ఆదిత్య లోకేషన్‌ను పోలీసులు కనుక్కున్నారు. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు రప్పించారు. బుధవారం సాయంత్రం అతడిని తండ్రి ప్రకాష్, సోదరుడు సాత్విక్‌సూర్యకు అప్పగించారు.

## ముగ్గురు సీఐలకు రెగ్యులర్ ఉత్తర్వులు


తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటాచ్‌మెంటులో పనిచేస్తున్న ముగ్గురు సీఐలను ఆయా స్థానాల్లో రెగ్యులర్ చేస్తూ అనంతపురం డీఐజీ షిమోషీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, యూనివర్సిటీ సీఐ రామయ్య ఉన్నారు. పనితీరు, క్రమశిక్షణ, ఇతరత్రా కారణాలను కొలమానంగా తీసుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం వివరాలను టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 62,248 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,852 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

## పంచారామాలకు ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పంచారామాలను సందర్శించేందుకు ఏపీఎస్ ఆర్టీసీ శుక్రవారం ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం ఒంటి గంటకు సెంట్రల్ బస్టాండులో సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. నెల్లూరు, గుంటూరు, విజయవాడ మీదుగా సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి నుంచి తిరుగు ప్రయాణమై ఈనెల 24న ఉదయం తిరుపతికి చేరుకుంటుంది. టికెట్ ధర రూ.2,500గా నిర్ణయించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ కోరారు.



పూజలు చేస్తున్న వేదపండితులు

## వేదోక్తంగా లక్ష బిల్వార్చన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో లక్ష బిల్వ, కుంకుమార్చను వేదోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అలంకార మండపంలో కార్యక్రమాన్ని రుత్వికులు ప్రారంభించారు. ఆలయ అనువంశిక ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో మొదట సంకల్ప పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు అర్చన సాగింది. అనంతరం సాయంత్రం నాలోగ కాలం అర్చన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు సంబంధం గురుకల్, ఏఈవో లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

## గాడిలో పంచాయతీ పాలన

- జిల్లాలో గ్రేడ్-5 కార్యదర్శులు 220 మందికి డీడీవో అధికారాలు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలనను గాడిలో పెట్టడానికి 'కూటమి' ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో 774 పంచాయతీలు ఉండగా అందులో 22 మేజర్. అన్ని పంచాయతీలకు కార్యదర్శులు ఉండేలా చూస్తోంది. సచివాలయ పరిధిలో పనిచేసే గ్రేడ్-5 కార్యదర్శులకు గతంలో డీడీవో అధికారం ఉండేది కాదు. వారికి డీడీవో అధికారాలు ఇవ్వాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాలోని సచివాలయాల్లో పని చేస్తున్న 220 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో (డ్రాయింగ్ అండ్ డిస్బర్‌మెంట్ ఆఫీసర్) అధికారం ఇస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల నుంచే అమల్లోకి వచ్చింది. తద్వారా వీరికి చెక్ పవర్ రావడంతో పంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులను డ్రా చేసి వినియోగించే అధికారం ఉంటుంది. దీంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు సజావుగా సాగతాయి. సచివాలయంలో ఉండే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాతకమైందని డీపీవో సుశీలా దేవి అన్నారు. తద్వారా చిన్న పంచాయతీల్లోను గ్రామాభివృద్ధికి అవసరమయ్యే నిధులను డ్రా చేసుకునే అవకాశం దక్కుతుందన్నారు.

## హైదరాబాద్ బయల్దేరిన నారా భువనేశ్వరి



నారావారిపల్లెలో భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న రవినాయుడు, నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మలు

చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ బయలుదేరారు. మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలకు సీఎం, ఆయన కుటుంబ సభ్యులు ఇటీవల హాజరైన విషయం విదితమే. సీఎం సోమవారం మధ్యాహ్నం అమరావతికి వెళ్లగా భువనేశ్వరి నారావారిపల్లెలో ఉన్నారు. బుధవారం ఆమె రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా నారావారిపల్లెలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహాయాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, గ్రామస్థులు ఆమెకు వీడ్కోలు పలికారు. రామ్మూర్తి నాయుడు కర్మక్రియల నేపథ్యంలో భువనేశ్వరి తిరిగి ఈనెల 25న రానున్నట్లు సమాచారం. కాగా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. ఆయన కుమారులు సినీహీరో రోహిత్, గిరీష్‌లను పరామర్శించారు.

- సమీక్షలు- సమావేశాలు

# వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులను వేగవంతం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి కారిడార్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. పారిశ్రామికవాడలకు కావాల్సిన నీటి సరఫరా పైపులైన్ పనుల పురోగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వీరశేఖర్‌రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.

### గడువులోగా 'జలజీవన్' పనులు పూర్తి చేయాలి

జలజీవన్ మిషన్ పనులను గడవులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 2,532 పనుల్లో భాగంగా 1,333 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులకు సంబంధించి సర్వే కొనసాగుతోందన్నారు. ఈ సర్వేను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొళాయి కనెక్షన్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీపీడబ్ల్యూఎస్ సమగ్ర నీటి పథకం పనులను పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా వంటి పనులను నాణ్యతతో నిర్వహించాలన్నారు. అనంతరం 'మన మరుగుదొడ్డి మన గౌరవం' పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయకుమార్, అన్ని మండలాల ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

## రెండు గంటలు ఆలస్యంగా సప్తగిరి ఎక్స్‌ప్రెస్

తిరుపతి(ఆటోనగర్)నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై మధ్య రోజూ రెండు పర్యాయాలు రాకపోకలు సాగిస్తున్న సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బుధవారం రెండు గంటలు ఆలస్యంగా నడిచింది. ఉదయం తిరుపతికి 9.50కు చేరుకుని 10.10 గంటలకు తిరిగి బయలుదేరాల్సి ఉంది. అయితే 12.15 గంటలకు తిరుపతికి చేరుకుని 12.35కు బయలుదేరి వెళ్లింది. తిరిగి తిరుపతికి సాయంత్రం 5.55 గంటలకు చేరుకుని 6.10 గంటలకు బయలుదేరాల్సి ఉన్నా రెండు గంటలు ఆలస్యమైంది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను అధికారులు రీషెడ్యూల్ చేశారు.

# చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి నాలుగు అధునాతన అంబులెన్సులు

### సీహెచ్‌సీగా గుడిపాల పీహెచ్‌సీ అప్‌గ్రేడేషన్‌కు ఆదేశాలు ● ఎమ్మెల్యే జగన్మోహన్ విజ్ఞప్తిపై స్పందించిన సీఎం చంద్రబాబు




చిత్తూరు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గంలో వైద్యంపై ఎమ్మెల్యే జగన్మోహన్ ప్రత్యేక శ్రద్ధ వహించడంతో మంచి ఫలితాలు వచ్చాయి.ఎమ్మెల్యే అయిన వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించి ఏం కావాలో గ్రహించారు.ఇందు కోసం అసెంబ్లీ సమావేశాలను చక్కగా వాడుకున్నారు. 600 పడకలకు పైగా ఉన్న చిత్తూరు ప్రధాన ప్రభుత్వాస్పత్రికి అధునాతన టెక్నాలజీ కలిగిన అంబులెన్సులు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం వాటిని ఏర్పాటు చేయాలని ముఖ్యకార్యదర్శి రవిచంద్రను ఆదేశించారు. అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, బేసిక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, వెంటిలేటర్లు గల కార్డియాక్ అంబులెన్స్, జీపీఎస్ ట్రాకింగ్ కలిగిన అంబులెన్స్‌లు సరఫరా చేయాలని, అందుకు కావాల్సిన నిధులను కేటాయించాలని సీఎం ముఖ్యకార్యదర్శి రాష్ట్ర ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు రక్త పంపిణీ, రక్తదానం స్పెషల్ వెహికల్, హై ఎండ్ యూఎస్‌జీ మెషిన్లు రెండు సరఫరా చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.అలాగే తన సొంత మండలమైన గుడిపాలలో పీహెచ్‌సీని 50 పడకల సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని సీఎంకు జగన్మోహన్ విజ్ఞప్తి చేశారు.స్పందించిన సీఎం చర్యలు తీసుకోవాలని ముఖ్యకార్యదర్శి రవిచంద్రను ఆదేశించారు. సీఎం ఆదేశానుసారం అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అధికారులను రవిచంద్ర ఆదేశించారు. అప్‌గ్రేడ్ చేసేందుకు తీసుకున్న చర్యలను నెలరోజుల్లో తమకు తెలియజేయాలని ఆయన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## వైసీపీ హయాంలో చెలరేగిన మెడికల్ మాఫియా

● ఎమ్మెల్యే మురళీ మోహన్



చిత్తూరు సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మెడికల్ మాఫియా చెలరేగిపోయిందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జనరిక్ మందుల దుకాణాల్లో భారీగా అవినీతి జరిగిందని చెప్పారు.అయితే ఇప్పుడు ప్రతి పేదవాడికీ ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 2014-19 లో టీడీపీ అధికారంలో ఉన్నపుడు జనరిక్ మందుల వినియోగంపై స్వచ్ఛంద సంస్థలు, డ్వాక్రా సంఘాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారని గుర్తు చేశారు. దీంతో పేద ప్రజలకు తక్కువ ధరకే మందులు అందుబాటులో ఉండేవని వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జనరిక్ మందులపై ఫోకస్ తగ్గించి భారీ ఆదాయం వచ్చే మద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి మండలంలో జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేస్తే పేద ప్రజలకు తక్కువ ధరకే మందులు అందుబాటులో ఉండే అవకాశం ఉందని చెప్పారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో జనరిక్ మందుల దుకాణాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు.

## కోసలనగరంలో పరిశ్రమలు ఏర్పాటు చేయండి

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



నగరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరి నియోజకవర్గంలోని కోసలనగరం పారిశ్రామిక రంగానికి ఎంతో అనుకూలమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీలో ఆయన ప్రసంగిస్తూ పది సంవత్సరాల క్రితం కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ 2500 ఎకరాల భూమిని సేకరించిందని గుర్తుచేశారు.అయితే ఇప్పటికీ ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదన్నారు.తచ్చూరు–చిత్తూరు జాతీయ రహదారి, చెన్నై–తిరుపతి జాతీయ రహదారి కోసలనగరం మీదుగానే గుండా పోతోందన్నారు. చెన్నైకి, తిరుపతి విమానాశ్రయానికి, కృష్ణపట్నం పోర్టుకు 60 కిలోమీటర్ల దూరంలో కోసలనగరం ఉందని పేర్కొన్నారు. అంతే కాకుండా చెన్నై - బెంగళూరుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ వే కూడా ఈ కోసలనగరం మీదుగా వెళుతుందని తెలిపారు. ఇంత అనుకూలంగా ఉన్న కోసలనగరంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రాష్ట్రం ఆర్థిక ప్రగతి సాధించడంతో పాటు ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

# అతి వేగం ... గాల్లో కలిసిన ప్రాణం

### విహార యాత్ర చేస్తూ యువకుడు దుర్మరణం

### ఆటోను ఢీకొని, ఆపై సూచిక బోర్డును ఢీకొంటూ మృత్యువాత


తాటి హర్ష వెంకట వరుణ్

గంగవరం, నవంబరు 20,(ఆంధ్రజ్యోతి): సరదాగా స్నేహితులతో కలసి బైక్ రైడింగ్ చేస్తూ విహార యాత్రకు బయలుదేరిన యువకుడు రోడ్డుప్రమాద బారిన పడి మృతిచెందిన ఘటన ంగవరం మండల పరిధిలోని దండుపల్లె జంక్షన్‌లో బుధవారం చోటుచేసుకుంది . పోలీసుల కథనం మేరకు ... కృష్ణా జిల్లా నందిగామకు చెందిన తాటి శ్రీను కుమారుడు తాటి హర్షవెంకట వరుణ్ (19) వెటర్నరీ కోర్సు చదువుతున్నాడు. బీఎండబ్ల్యూ కంపెనీకి చెందిన ఖరీదైన బైక్ కొనుగోలు చేసి, బీఎండబ్ల్యూ వాట్సప్ గ్రూప్‌లో జాయిన్ అయ్యాడు. గ్రూపులో ఎవరెవరు బీఎండబ్ల్యూ బైక్‌లపై విహారయాత్రకు వస్తున్నారని మెసేజ్ పెట్టడంతో తాటి హర్షవెంకటవరుణ్ ఓకే చెప్పాడు. హర్షతోపాటు రాజమండ్రికి చెందిన వినయ్, మండపేటకు చెందిన రాహుల్, కావలికి చెందిన లతీఫ్ ఒక బృందంగా ఏర్పడి విజయవాడ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని టూరిస్ట్ ప్రదేశం కూర్గ్‌కు బయలుదేరారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో నలుగురూ బీఎండబ్ల్యూ ద్విచక్రవాహనాలపై అతివేగంగా వస్తూ గంగవరం మండల పరిధిలోని దండుపల్లె జంక్షన్ వద్ద తాటి హర్ష వెంకట వరుణ్ ఆటోను ఢీకొని, ఆపై రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని హర్ష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం సీఐ ప్రసాద్ తెలిపారు.

# పంటలపై మళ్లీ మొదలైన గజదాడులు



ధ్వంసమైన టమోటా పంట - పూరిపాకను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో మూడు నెలలుగా పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు మూడు రోజుల విరామం అనంతరం మంగళవారం రాత్రి మళ్లీ మొదలయ్యాయి. ఈనెల 16న మతుకువారిపల్లె పంచాయతీలో పంటలను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు సదుం మండలం చీకలచేను వైపు వెళ్లిపోయాయి.అక్కడినుంచి పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీలోకి చేరుకుని పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు పాలగుట్టపల్లి, వల్లివేడు పంచాయతీల గుండా పులిచెర్ల మండలంలోని తూర్పు అటవీవిభాగంలోకి చేరుకున్నాయి.మంగళవారం రాత్రి 10 ఏనుగుల గుంపు పులిచెర్ల పంచాయతీ వగళ్లవారిపల్లెలోని జయమునిరత్నంకు చెందిన 50 అరటిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి ఎర్రపాపిరెడ్డిగారిపల్లె పంచాయతీ పిచ్చిగుంటపల్లె వద్దకు చేరుకుని చిన్నస్వామికి చెందిన వరిపంటను, రెండు విద్యుత్ స్తంభాలను ధ్వంసం చేశాయి. విద్యుత్ స్తంభాలపై దాడి చేసిన సమయంలో సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.అక్కడినుంచి కృష్ణమ్మచెరువు చేరుకున్న ఏనుగులు ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డికి చెందిన టమోటా పంట, పూరిపాకను ధ్వంసం చేశాయి. తర్వాత రొంపిచెర్ల మండలంలోకి ప్రవేశించి అప్పేపల్లి మీదుగా చిన్నగొట్టిగల్లు మండలంలోని మామిడితోటల్లో మాటువేశాయి. అటవీ శాఖ అధికారులు ఏనుగుల గుంపును భాకరాపేట అడవివైపు మళ్లించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. తిరిగి పులిచెర్ల మండలంలోని మంగళంపేట చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## ఆస్పత్రుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఆస్పత్రుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి వివిధ అంశాలపై డీఎంహెచ్‌వో ప్రభావతిదేవితో కలసి వైద్యాధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రులలో ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందించడంలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డయాగ్నస్టిక్, ల్యాబొరేటరీ, ఆపరేషన్, కాన్పు సేవలకు అవసరమైన సదుపాయాలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాస్థాయి, డివిజన్ స్థాయి ఆస్పత్రులకు అవసరమైన బడ్జెట్ వివరాలు సమీక్షించి ప్రణాళిక ద్వారా వైద్యసేవలు అందించాలన్నారు. వైద్య అధికారి నిరంజన్‌రెడ్డి, క్వాలిటీ మేనేజర్ దివ్య ఆస్పత్రులలో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలపై నివేదిక అందజేశారు.

## 'అపార్' కార్డుల ఆధార్ సవరణలు వెంటనే పరిష్కరించాలి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అపార్ కార్డుల మంజూరుకు సంబంధించి ఆధార్ సవరణలో తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా కార్డుల సమస్యల పరిష్కారాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 71.87శాతం అపార్ కార్డుల జనరేషన్ పూర్తయ్యిందని తెలిపారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అపార్ కార్డు మంజూరుకు రెవెన్యూ అధికారులతో విద్యాశాఖ సమన్వయం చేసుకుని గడువులోగా వందశాతం ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆధార్ సెంటర్లకు పంపకుండా సంబంధిత ఎంపీడీవో, ఎంఈవో అధికారుల మొబైల్ ఆధార్ సెంటర్ ద్వారా సవరణలను పాఠశాలల్లోనే చేయాలన్నారు. సవరణలకోసం వచ్చే దరఖాస్తులను ఆర్డీవోలు, తహసీల్దార్లు తమ లాగిన్‌లో ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. అపార్ విద్యార్థుల గుర్తింపు కార్డుల జారీకి సంబంధించి నోటరీ అఫిడవిట్ అవసరం లేదని, పంచాయతీ సెక్రటరీలు వారి పరిధిలోని పాఠశాలల్లో ఆధార్ అప్డేషన్‌కు సంబంధించిన కరెక్షన్లు చేయాలని చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో డీఈవో, సమగ్ర శిక్ష ఏపీసీ, డీఎల్డీవో, డీవైఈవో, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నెలరోజుల్లో సీసీ రోడ్ల పనులు పూర్తిచేయండి

● కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుత ఏడాది మంజూరైన 1500 అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంలో పురోగతిలో వున్న 612 పనులను వచ్చేనెల 20వ తేదీలోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో అంతర్గత సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, బీటీ రోడ్లు, ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన పనుల పురోగతిపై నియోజకవర్గాల వారీగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. 269 పనులకు గాను రూ.13.14 కోట్లు బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కాగా ఇందులో రూ.7.95 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. పంచాయతీరాజ్, డ్వామా అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్ల నిర్మాణాలు నాణ్యతతో పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్క్ ఐడీ క్రియేట్ చేసి జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్, పీఆర్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# పెద్దఉప్పరపల్లెలో అటవీ శాఖ వాహనం అడ్డగింత


పెద్దఉప్పరపల్లెలో అటవీశాఖ వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

సోమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో బుధవారం సాయంత్రం పుంగనూరు ఎఫ్ఆర్‌వో శ్రీరాములు వాహనాన్ని గ్రామస్తులు అడుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి చొరవతో దేవదాయశాఖ మంజూరు చేసిన రూ. 9 కోట్ల నిధులతో మూడేళ్ల నుంచి దుర్గంకొండ మునీశ్వరస్వామి ఆలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. బోనమంద నుంచి దుర్గంకొండకు 6 కిలోమీటర్లు డబుల్ రోడ్డు పనులు పూర్తి చేశారు. ప్రయాణీకుల రాకపోకలు కొనసాగుతున్నాయి. కొండపై గాలిగోపురం, వినాయకస్వామి ఆలయం, కొండ నుంచి మెట్ల మార్గం పూర్తి చేశారు. ప్రస్తుతం కొండపైనే మునీశ్వర స్వామి, నందివాహనం గర్భగుడి పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు అటవీశాఖ అధికారులు కొండపై నిర్మాణాలు చేపట్టరాదని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసినా పనులు కొనసాగించడంతో బుధవారం సాయంత్రం ఎఫ్ఆర్‌వో శ్రీరాములు స్థానిక అటవీ సిబ్బందితో కలసి వెళ్లి కాంట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. యంత్ర పరికరాలను పుంగనూరుకు తరలిస్తుండగా పెద్దఉప్పరపల్లె గ్రామస్తులు, అయ్యప్ప భక్తులు, శివదీక్ష భక్తులు అటవీ అధికారి వాహనాన్ని అడ్డుకొన్నారు. ఆలయ అభివృద్ధి పనులను అడ్డుకోవడం తగదని యంత్రపరికరాలను తీసుకెళ్లరాదని వాదనకు దిగారు. దీంతో అటవీ అధికారులు యంత్ర పరికరాలను అక్కడే వదలి కాంట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో శ్రీరాములు మాట్లాడుతూ కాంట్రాక్టరుకు రెండు పర్యాయాలు నోటీసులు ఇచ్చినా కొండపై ఆలయ గోపురానికి అనుమతులు చూపడం లేదన్నారు. అనుమతులు చూపకపోవడంతో పనులు ఆపేయాలని తెలిపామన్నారు.

# ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు షురూ


రామకుప్పం మండలంలోని ఆవులకుంట భూములను పరిశీలిస్తున్న ఎయిర్ పోర్టు అథారిటీ అధికారులు

రామకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు ఊపందుకున్నాయి. ఉద్యానపంటలకు ఆలవాలమైన ఈ ప్రాంతం నుంచి వ్యవసాయోత్పత్తుల తరలింపునకు వీలుగా శాంతిపురం, రామకుప్పం మండలాల మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌స్ట్రిప్(చిన్నపాటి విమానాశ్రయం) ఏర్పాటు చేయాలని 2017లో టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లో శాంతిపురం మండలం అమ్మవారిపేట, రామకుప్పం మండలం కిలాకిపోడు, కడిశినకుప్పం, వెంకటేశ్‌పురం, మణీంద్రం, విజలాపురం గ్రామాల సమీపంలో 845ఎకరాల భూసేకరణ చేసింది.రైతులకు అప్పట్లోనే ప్రభుత్వం నష్టపరిహారం కూడా చెల్లించింది. 2018 చివరలో సీఎం చంద్రబాబు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుకు శంకుస్థాపన కూడా చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పాలకులు ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుకు సుముఖత చూపలేదు.సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అప్పట్లో వైసీపీ నేతలు ప్రకటించారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు. ఇటీవల టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటు విషయంలో కదలిక వచ్చింది. వైసీపీ ప్రభుత్వం ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటును పట్టించుకోలేదని, అందుకు ప్రతిగా ఇక్కడ కార్గో ఎయిర్‌స్ట్రిప్‌తో పాటు, డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి, కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. దీని కోసం మరో 330 ఎకరాల భూసేకరణ చేపట్టాలని కూడా నిర్ణయించి అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ భూసేకరణ విషయంలో రైతుల నుంచి ఎటువంటి ప్రతిఘటన ఎదురవకపోవడంతో భూసేకరణ సాఫీగా జరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు సుముఖత వ్యక్తం చేసిన కేంద్రం ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారుల నేతృత్వంలో ఒక బృందాన్ని నియమించింది. అంతేకాకుండా ఈ ప్రక్రియ చేపట్టేందుకు రూ.1.92కోట్ల నిధులు మంజూరు చేసింది.ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల బృందం మంగళవారం రామకుప్పం, శాంతిపురం మండలాల్లో గతంలో సేకరించిన భూములు, ప్రస్తుతం సేకరించిన భూములను పరిశీలించింది. సేకరించిన భూములు ఏయేఏయే ప్రాంతాల్లో ఉన్నాయి, ఆ భూముల్లో ఎన్ని చెరువులు, కుంటలు ఉన్నాయని ఆరా తీసిన అధికారులు వాటిని పరిశీలించారు. భూసేకరణపై ఎక్కడికక్కడ రెవిన్యూ , ఇరిగేషన్ అధికారులు స్కెచ్‌లను వారికి చూపించి సందేహాలను నివృత్తి చేశారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనువుగా ఉన్నట్టు అధికారుల బృందం ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. భూముల పరిశీలన అనంతరం అధికారుల బృందం రామకుప్పం మండలం ననియాలలోని కుంకీ ఎలిఫెంట్ క్యాంపు వద్దకు చేరుకున్నారు.నియోజకవర్గ అధికారులు, టీడీపీ నేతలతో సమావేశమయ్యారు.కడా పీవో వికాస్ మర్మత్, ఆర్డీవో శ్రీనివాసులరాజు, ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు తదితరులు అక్కడి పరిస్థితులను వివరించారు.టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ ఎంపీపీ, ఆంజినేయరెడ్డి,వైస్ఎంపీపీ చిన్ని కృష్ణ, తెలుగుయువత మండల ప్రధానకార్యదర్శి వెంకటాచలం, నేతలు శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, మహ్మద్‌రఫీ, సత్తి, కుమార్, చంద్రశేఖర రెడ్డి, నాగభూషణం, కామరాజనాయక్, రామకుప్పం, శాంతిపురం తహశీల్దార్లు బాబు, శివయ్య పాల్గొన్నారు.

## పవన్ చిత్రపటానికి వైసీపీ నేత పాలాభిషేకం



రామకుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో పాటు, ఆయన కుటుంబసభ్యులపై గతంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత ఒకరు బుధవారం పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రామకుప్పం మండలం గాంధీనగరానికి చెందిన వైసీపీ నేత రమణ ఎన్నికలకు ముందు వలంటీర్ల విషయంలో పవన్‌కల్యాణ్ వైఖరిని ఖండిస్తూ ఆయనను, అయన కుటుంబసభ్యులను పరుష పదజాలంతో దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. అప్పటి నుంచి జనసేన నేతలు అతడికి బుద్ధి చెప్పాలని వేచి చూశారు. బుధవారం రామకుప్పంలో ఉండగా జనసేన మండల అధ్యక్షుడు హరీష్ తమ పార్టీ నేతలతో కలిసి రమణను నిలదీశారు. దీంతో రమణ తాను మద్యం మత్తులో ఆ పోస్టు పెట్టానని, క్షమించాలని ప్రాధేయపడ్డాడు.దీంతో వారు శాంతించి పోలీస్‌స్టేషను సర్కిల్లో పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి అతడితో పాలాభిషేకం చేయించారు.

## ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు



చిత్తూరు అర్బన్, నవంబరు 20: చిత్తూరులో గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు.ఇరువారం ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని వచ్చిన సమాచారంతో ఎస్ఐలు ప్రసాద్, సుగుణ, సిబ్బందితో కలిసి మంగళవారం నీవానది బ్రిడ్జి సమీపంలో దాడులు నిర్వహించారు.ప్రశాంత్‌నగర్‌కు చెందిన అల్లాబక్ష్, తులసి, సురేష్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద 1295 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.బుధవారం నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## గంజాయి ముఠా గుట్టురట్టు

### 11.5 కేజీల గంజాయి స్వాధీనం, నలుగురి అరెస్టు



గంగవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) :గంగవరం మండల పరిధిలోని చిన్నూరు ఫ్లైఓవర్ వద్ద గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు.సీఐ ప్రసాద్ కథనం మేరకు... గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు బుధవారం దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా నలుగురిని పట్టుకుని 5 ప్యాకెట్ల(11.5 కేజీలు)గంజాయి ని సీజ్ చేశారు.నిందితుల్లో పలమనేరుకు చెందిన ఆటోమెకానిక్ ఎం.మోహన్ (37), ఆటోడ్రైవర్ ఎ.జోసెఫ్ (50), గంగవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన పెయింటర్ ఎస్.మస్తాన్(37), గంటావూరుకు చెందిన ఆటోడ్రైవర్ ఎన్. ఆంటోని(52)వున్నారు.

# పలమనేరు
## కుప్పం/పుంగనూరు

## ద్రావిడలో ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న వీసీ దొరస్వామి

గుడుపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : ద్రావిడ విశ్వవిద్యాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ఆచార్య దొరస్వామి మాట్లాడుతూ వర్సిటీలోని గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఎక్కువ సమయం గ్రంథాలయంలో గడపడం వల్ల తమ విద్యాభ్యాసంలో విశేష ప్రతిభ కనబరుస్తారన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, డీన్ అకడమిక్ అఫైర్స్ శ్యామల, వారోత్సవాల కన్వీనర్ డా.అవినేని కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పుంగనూరు రూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలోని పుస్తకాలు చదివి ఉన్నతస్థానాలకు వెళ్లాలని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది తోటగిరినాథ్, కుటమి నాయకులు సీవీరెడ్డి, పగడాల రమణ, గ్రంథాలయాధికారి తులసీనాయక్ పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థులకు ఓర్పు, సహనం ఉండాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారావు

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థులకు ఓర్పు, సహనాలే ఆభరణాలని కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అండ్ డీన్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు అన్నారు. ఆ కళాశాలలో 20వ బ్యాచ్ బీఎస్సీ నర్సింగ్ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు సేవా దృక్పథంతో సేవలు అందించాలని సూచించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అభిరామి మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు జాలి, క్రమశిక్షణ, అంకితభావం వంటి విలువలను అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఈఎస్ వైద్య కళాశాల సలహాదారు డాక్టర్ వైజే.విశ్వేశ్వరరెడ్డి, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.డేనియల్ అరుణ్‌కుమార్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు జ్ఞాన కేంద్రాలు

కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞాన వికాస కేంద్రాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఎస్ఎం మాట్లాడుతూ గ్రంథాయాలలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వారోత్సవాల సందర్భంగా కుప్పం పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, బీసీ బాలికల సంక్షేమ వసతి గృహంలోని పిల్లలకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. వీరిలో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. వసుధైక కుటుంబం సంస్థతో పాటు, కోకోకోలా డిస్ట్రిబ్యూటర్ రాధాకుమార్‌లు ఈ బహుమతులను స్పాన్సర్ చేశారు. గ్రంథాలయాధికారి సత్యవాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, లయన్స్ క్లబ్ సలహాదారు మహేశ్, ఉపాధ్యాయులు అమరజ్యోతి, సుబ్బరామన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సెల్వం, ప్రసాద్, కృష్ణమూర్తి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బోదగుట్టపల్లెలో గ్రామ సభ

కుప్పం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమూరు పంచాయతీ బోదగుట్టపల్లెలో బుధవారం తహసీల్దారు చిట్టిబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ప్రజలనుంచి వివిధ భూ సంబంధిత సమస్యలపై అర్జీలు స్వీకరించి, త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంతోశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెద్దగుట్టపల్లెలో రెవెన్యూ గ్రామ సభ జరిగింది. వీఆర్వో మహేశ్, సర్వేయర్ గణేశ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి చెక్కునత్తం మణి, వార్డు సభ్యుడు బాలు పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలి

బైరెడ్డిపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్, వైద్యశాఖ సమన్వయంతో గ్రామాల్లో ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో అరుణ కోరారు. బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గ్రామాలను సందర్శించి గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహార ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, మాతాశిశు మరణాల నివారణ గురించి వివరించాలన్నారు. ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, వైద్యసిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టిప్పుసుల్తాన్‌కు ఘన నివాళి



కుప్పం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ మోడల్ కాలనీలో బుధవారం టిప్పు బాయ్స్ ఆధ్వర్యంలో టిప్పు సుల్తాన్ జయంతి నిర్వహించారు. టిప్పు సుల్తాన్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. టీడీపీ కుప్పం నియోజకవర్గ మైనారిటీ నాయకులు జాకీర్, ఫైరోజ్, హఫీజ్, సర్దార్, నబి, అల్లాబక్ష్, ఉమర్, ఇర్ఫాన్, జాలు, ఖాసీం, ఇమ్రాన్, ఖలీల్, సలీం, అస్లాం, అంజేత్, అఫ్రోజ్, అక్మల్, షేక్షావలి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వండి : చల్లా

రొంపిచెర్ల, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): గతంలో ఇళ్లు మంజూరై ఇంకా నిర్మించుకోని వారిని గుర్తించి తొలగించి అర్హులకు ఇవ్వాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన రొంపిచెర్లలోని పలు కాలనీలను తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ యోగానంద్‌లతో కలిసి పరిశీలించారు. ఇళ్లు నిర్మించని వారిని సంప్రదించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. డంపింగ్ యార్డు కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి పిచ్చిగుంటవారిపల్లె వద్ద ఉన్న బోరునీటిని అందించాలన్నారు. లేఅవుట్‌లో తాగునీరు, సింథటిక్ ట్యాంకులు, సిమెంట్ రోడ్లు, గ్రావెల్ రోడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు చల్లాబాబు దృష్టికి తీసుకురాగా మీ సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్, రాష్ట్ర కురబకుల డైరెక్టరు ఉయ్యాల రమణ, నాయకులు సహదేవ, గూడూరి హరిబాబు, రామమూర్తి, గౌస్‌పాల్‌ఖాన్, కరీముల్లా, ఇమ్రాన్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి
### బీసీవై అధినేత రామచంద్రయాదవ్ డిమాండ్

పుంగనూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): శాసన సభా సమావేశాలకు హాజరు కాని వైసీపీ ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలని బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి కనీసం సగం మంది గెలిచినా ప్రజల మద్దతు ఉన్నట్టేనని సవాల్ చేస్తూ లేఖ రాసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 151మంది ఎమ్మెల్యేలతో అధికారంలోకి వచ్చి అవినీతితో అక్రమాలు చేసి ప్రజలతో తిరస్కరించబడిన పార్టీగా వైసీపీ చరిత్రలో నిలచిపోయిందన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ

గుడుపల్లె, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : గుడుపల్లె మండలంలోని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రీజినల్ స్థాయి నాయకత్వంపై విద్యాశాఖ నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆర్డీడీ శామ్యూల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రీజినల్ స్థాయి నాయకత్వంపై ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం

### ప్రజాదర్బార్‌లో కడ పీడీ వికాస్‌మర్మత్


ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న కడ పీవో వికాస్‌మర్మత్

రామకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల సత్వర పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కడ పీడీ వికాస్‌మర్మత్ తెలిపారు. బుధవారం రామకుప్పం మండలం బందార్లపల్లెలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. కుప్పం నియోజకవర్గంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి ఇటీవల భారీగా నిధులు మంజూరు కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తారు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాల్లో మురుగునీటి కాల్వల నిర్మాణం కోసం రూ.110కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, టీడీపీ బోర్డు సభ్యుడు శాంతారాం మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులరాజు, గ్రామీణ సీఐ మల్లేషయాదవ్, తహసీల్దారు బాబు, ఎంపీడీవో లక్ష్మీకాంతం, టీడీపీ నాయకులు మునస్వామి, పత్రనారాయణాచారి, ఆనందరెడ్డి, నరసింహులు, చలపతి, ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, వెంకటాచలం, రామ్మూర్తి, సీతాపతి, గంట్లప్పగౌడు, సలాంసాబ్, జయశంకర్, మహ్మద్‌రఫీ, సత్తి, నాగభూషణం పాల్గొన్నారు.

**రెవెన్యూ శాఖ పనితీరు బాగాలేదు**

దశాబ్దాలు గడుస్తున్నా రెవెన్యూ శాఖ పనితీరులో ఆశించిన మార్పు రాలేదని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రామకుప్పం మండలం బందార్లపల్లెలో జరిగిన ప్రజావేదికలో ఆయన తన స్వీయ అనుభవాన్ని వివరిస్తూ తన పరిస్థితే ఇలా ఉంటే సామాన్య రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చన్నారు. శాంతిపురం మండలం వెంకటేపల్లె సమీపంలో 151/4 సర్వేనెంబరులో 89సెంట్ల భూమిని తనతండ్రి 1970లలో కొనుగోలు చేశారన్నారు. అందులో 32సెంట్ల భూమిని అనంతర కాలంలో ఇతరులకు విక్రయించామన్నారు. మిగిలిన 57సెంట్లకు సంబంధించి తన తండ్రి పేరిట పాసుబుక్ కోసం దరఖాస్తు చేసుకుంటే అప్పటి అధికారులు కేవలం 40సెంట్లకు మాత్రమే పాసుబుక్ ఇచ్చారన్నారు. ఆయన మరణానంతరం 2021లో తాము తిరిగి అర్జీ పెట్టుకుంటే తన తల్లి పేరిట 25సెంట్లకు మాత్రమే పాసుబుక్ ఇచ్చారన్నారు. ప్రస్తుతం తమ అనుభవంలో ఉన్న 57సెంట్ల భూమికి సంబంధించి కేవలం 25 సెంట్లకు మాత్రమే పాసుబుక్ ఉందన్నారు. మిగిలిన 32సెంట్ల భూమికి సంబంధించి పాసుబుక్ కోసం పలుసార్లు రెవిన్యూ అధికారులకు వినతులిచ్చినా ఫలితం లేకపోయిందన్నారు. ఒక పార్టీకి రాష్ట్ర అధికార ప్రతినిధిగా, మాజీ ఎంపీగా, మాజీ ఎమ్మెల్సీగా ఉన్న తన కుటుంబానికే ఇలా జరుగుతుంటే, సామాన్య రైతులు, జనం పరిస్థితేంటని ఆయన ప్రశ్నించారు.

### రెవెన్యూ సమస్యలపై 133 వినతులు


ప్రజాదర్బార్‌లో వినతులిచ్చేందుకు బారులు తీరిన జనం

కడ పీవో వికాస్‌మర్మత్ ఆధ్వర్యంలో బుధవారం మన పంచాయతీకి- మన చంద్రన్న ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బందార్లపల్లెలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు జనం పోటెత్తారు. జనం బారులు తీరి తమ సమస్యలపై అధికారులకు వినతి పత్రాలిచ్చారు ప్రజల నుంచి మొత్తం 407 వినతులొచ్చాయి. వాటిలో అత్యధికంగా ఇళ్ళ స్థలాలు, పక్కాగృహాల మంజూరు కోసం 145 వినతులు రాగా, రెవిన్యూ సమస్యలపై 133 వినతులొచ్చాయి. మండల పరిషత్‌కు సంబంధించి 44, పశుసంవర్ధక శాఖకు 25, వైద్యశాఖకు 12, పంచాయతీరాజ్‌కు 9, రెస్కోకు 6, ఇరిగేషన్‌కు 3, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యాశాఖకు 2చొప్పున, డీఆర్డీయే, పీఐయూ, వ్యవసాయశాఖకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున వినతులు వచ్చాయి.

## గ్రామీణ రోడ్లను బాగు చేయండి

బైరెడ్డిపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధ్వానంగా వున్న గ్రామీణ రహదారులను బాగుచేయడానికి ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని డీసీసీ కార్యదర్శి రమణప్ప ఒక ప్రకటనలో కోరారు. బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తంకు వెళ్లే రహదారి గుంతలమయమై దుస్థితికి చేరుకుందన్నారు. అలాగే బేలుపల్లె, కమ్మనపల్లె, ఎర్రకదిరేపల్లె, గాజీపేట, నెల్లిపట్ల తదితర గ్రామాలకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని టీచర్ ఆవేదన

బైరెడ్డిపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కమ్మనపల్లె ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ అనిత తనను కొంతకాలంగా మానసికంగా వేధిస్తున్నారని ఆ పాఠశాల ఇంగ్లీష్ టీచర్ కరుణ ఆరోపించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా తనను ప్రిన్సిపాల్ వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రిన్సిపాల్ అనితను వివరణ కోరగా ఇంగ్లీష్ టీచర్ కరుణ ఆరోపణల్లో వాస్తవం లేదని, పాఠశాలకు చెడ్డపేరు తెచ్చేవిధంగా అనవసరంగా రాద్ధాంతం చేయడం సమంజసం కాదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నట్లు చెప్పారు.

## వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

పుంగనూరు రూరల్, 20(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. రామసముద్రం మండలం చిన్నెపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి(75) పుంగనూరు మండలంలోని సుగాలిమిట్ట వద్ద రోడ్డుపై ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి గాయపడిన వెంకటరమణారెడ్డిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పాఠశాలల పనివేళల పెంపు సరికాదు

సోమల, నవంబరు 20( ఆంధ్రజ్యోతి): పాఠశాల పనివేళల పెంపు సరైన నిర్ణయం కాదని ఎస్టీయూ మండల అధ్యక్షుడు శివరాం అన్నారు. విద్యార్థుల అభ్యసన సంసిద్ధ, రవాణా సౌకర్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోకుండా పాఠశాల పనివేళలను పెంచడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దూరం నుంచి విద్యార్థులు పాఠశాలలకు వస్తారన్నారు. సకాలంలో రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల బాలికలకు భద్రతాపరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని ఏటిగడ్డపాళ్యంకు చెందిన తులసీరామ్ కుమారుడు వినయ్(23), పెద్దపంజాణికి చెందిన రెడ్డెప్పరెడ్డి కుమారుడు జనార్ధన్‌రెడ్డి(25)లు కలసి ద్విచక్రవాహంలో స్థానిక మార్కెట్ యార్డు నుంచి ప్రైవేటు బస్టాండ్‌కు అతి వేగంగా వెళ్లడంతో అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరి తలలకు దెబ్బలు తగలడంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కృష్ణానాయక్

పుంగనూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఏపీ గిరిజన కో ఆపరేటివ్ డైరెక్టరుగా పుంగనూరు మండలం పాళ్యంపల్లెకు చెందిన కృష్ణానాయక్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. దీంతో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లెకు వెళ్లి ఆయనను సన్మానించారు. కృష్ణానాయక్ మాట్లాడుతూ తాను గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

## ల్యాబ్ రికార్డుల తనిఖీ

పలమనేరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపాలిటీ కాకాతోపు యూపీఎస్‌సీలో ల్యాబ్ రికార్డులను సబ్ యూనిట్ అధికారి జయశంకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏఎన్ఎంలను ఉద్దేశించి మాట్లాడారు. ఏఎన్ఎంలు ప్రతి రోజూ గ్రామాల్లో జ్వర కేసులను గుర్తించి, జ్వరపీడితుల నుంచి రక్త పూతలను సేకరించి అదేరోజు ల్యాబ్‌కు పంపాలన్నారు. వారు పంపిన ఎం2 ఫారం ఆధారంగా చేసుకొని ఎం3 రిజిస్టరులో నమోదు చేసి అదేరోజు పరీక్ష చేసి వాటిలో పాజిటివ్ వచ్చిన వారి వివరాలను సబ్‌యూనిట్ అధికారికి తెలియజేయాలని సూచించారు. ఇ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## తండ్రి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు


వెంకటేష్

రామకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని కోదండరామనగర్ కాలనీకి చెందిన వెంకటేష్ ఆదివారం నుంచి కన్పించడం లేదని ఆయన కుమార్తె రాజేశ్వరి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ కోసం పలుచోట్ల వెదికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. తన తండ్రి ఆచూకీ తెలిసిన వారు 9391377239 నెంబరుకు సమాచారమివ్వాలని ఆమె కోరారు.

# అన్యాయాన్ని ప్రశ్నించే శక్తి పవన్‌కే..


జనసేన పార్టీలోకి స్వాగతిస్తున్న పసుపులేటి హరిప్రసాద్ తదితరులు

పుంగనూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): అన్యాయాన్ని ప్రశ్నించే శక్తి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కే దక్కుతుందని జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చదళ్ల గ్రామంలో జరిగిన సమావేశంలో జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 500మంది మైనార్టీలు, ఎన్టీఆర్ ట్రస్ట్ సభ్యులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే గ్రామాల్లో తిరిగి ప్రజా సమస్యలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వాలు చేసిన విధానాలను పక్కన పట్టి ప్రజలకు సేవలు చేసి మార్పు తీసుకురావడానికి ప్రయత్నం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రజలు అందుబాటులో ఉంటామన్నారు. సమావేశంలో నాయకులు పగడాల రమణ, చిన్నారాయల్, విరూపాక్షి, శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, చైతన్యరాయల్, హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి : డీపీవో


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో పార్వతమ్మ

చౌడేపల్లె, నవంబర్20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పారిశుధ్యం లోపించకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని డీపీవో పార్వతమ్మ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి 15 రోజులకొకసారి తాగునీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయాలని, అంటువ్యాధులు ప్రబలకుండా, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, ఈవోఆర్డీ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**సదుం :** పంచాయతీ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని డీపీవో పార్వతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సదుం, సోమల మండలాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో పంచాయతీ విధివిధాల నిర్వహణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణపై తగు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ వర్మీకంపోస్టు తయారీపై నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. అనంతరం సదుంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సదుం, సోమల ఇవోపీఆర్డీలు వరప్రసాద్, లక్ష్మీదేవమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

పుంగనూరు రూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు రాష్ట్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ విద్యార్థులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెట్టారని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పథకాన్ని రద్దు చేశారని మండిపడ్డారు. తిరిగి మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఉదయాన్నే కాలేజీలకు రావడంతో పస్తులు ఉంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మధ్యాహ్నభోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు మున్నా, మస్సూర్, మహేశ్, పోము, గణేశ్, సుహేల్, దావూద్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# భూవివాదంతో మామిడి చెట్ల నరికివేత


నరికివేయబడ్డ మామిడి చెట్లు

రామకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : రామకుప్పం మండలం సాకలకుప్పంలో భూవివాదం నేపథ్యంలో సరోజమ్మకు చెందిన మామిడి తోటలో చెట్లను ప్రత్యర్థులు నరికేశారు. బాధితురాలి కథనం మేరకు ...సాకలకుప్పానికి చెందిన వెంకటరెడ్డి భార్య సరోజమ్మకు సర్వే నెంబరు 430-1సీలో 80సెంట్లు, 431-1ఏలో 69సెంట్లు, 430-3లో 42సెంట్ల డీకేటీ భూమి ఉంది. ఆ భూముల్లో సరోజమ్మ కుటుంబ సభ్యులు 25ఏళ్ళ క్రితం మామిడి తోటను పెంపు చేశారు. అదే గ్రామానికి చెందిన వెంకటేశు ఆ భూముల్లో కొంత భూమి తమకు చెందుతుందని కొంతకాలంగా తరచూ గొడవ పడుతుండేవాడు. ఇటీవల సర్వేచేసిన రెవెన్యూ అధికారులు సరోజమ్మకు చెందిన భూముల్లో కొంతభాగం వెంకటేశుకు చెందుతుందని నిర్ధారించారు. కానీ హద్దుల్లో ఎటువంటి రాళ్ళు నాటలేదు. దీంతో రెండు కుటుంబాల మధ్య భూవివాదం కొనసాగుతూనే ఉంది. పలుపార్లు పెద్దమనుషులు పంచాయతీలు నిర్వహించినా ఫలితంలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం సరోజమ్మ కుటుంబసభ్యులు మామిడి తోటకు వెళ్ళి చూడగా 27మామిడి చెట్లు నరకబడి ఉండడాన్ని గుర్తించి హతాశులయ్యారు. వెంకటేశు, అతని కుమారుడు పవన్, సోదరుడు కృష్ణమూర్తే తమ మామిడి చెట్ల నరికివేతకు పాల్పడినట్టు సరోజమ్మ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

## మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వ చేయూత


మాట్లాడుతున్న ఎంపీడీవో లీలామాధవి

పుంగనూరు రూరల్, ననవంబరు20(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన వారు మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనున్నట్లు ఎంపీడీవో లీలా మాధవి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీంగ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో పర్యటించి ఇళ్లకు మరుగుదొడ్లు నిర్మించుకునే ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం 4 అడుగులకు 4అడుగులు నిర్మాణం చేసుకుంటే రూ. 11వేలు, 6అడుగులకు 4 అడుగులు నిర్మాణం చేపట్టితే 15వేలు రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చందన, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో ప్రయోజనాలు

గంగవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షలు చేయించుకొని పంటలు పండించడం రైతులకు శ్రేయస్కరం అని ఏవో హేమలత పేర్కొన్నారు. బుధవారం పసపత్తూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, భూసార పరీక్షల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని, అందుకు అనుగుణంగా పంటలు పండించడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గి, ఆశించిన దిగుబడి సాధించడానికి దోహదపడుతుందన్నారు. రైతులకు అవసరమైన అన్నిరకాల ఎరువులు, విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి వరప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ భవనాలు పూర్తయ్యేదెప్పుడు?

నిర్మాణాలు పూర్తికాక ఇబ్బంది పడుతున్న సిబ్బంది, జనం



ఆముదాల్లో 'వెల్‌నెస్, ఆర్బీకే' భవనాల పరిస్థితి



గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చాలా ప్రాంతాల్లో ఆగిపోయాయి. కొన్ని పునాదుల స్థాయిలో ఉంటే.. మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. దీనివల్ల ఇటు జనం, ఇటు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

- పాలసముద్రం/వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి





సీడీకండ్రిగ, కోదండరామాపురంలో సచివాలయం, అంగన్వాడీ భవనాల పరిస్థితి

### ఆముదాల్లో..

పాలసముద్రం మండలంలోని ఆముదాల్లో రెండు వేర్వేరు శాఖలకు చెందిన భవన నిర్మాణ పనులు పునాదుల స్థాయిలోనే నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రం (ఆర్బీకే), వెల్‌నెస్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ భవనాల నిర్మాణ పనులు చేపట్టిన వైసీపీ నేతలు ఆర్బీకేను పునాదుల వరకు నిర్మించి వదిలేశారు. ఇదే గ్రామంలో వెల్‌నెస్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికైతే పునాదులు తీసి.. పిల్లర్లు వేసి వదిలేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు అప్పటి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడిక్కడే నిలిపేశారు. ఈరెండు శాఖల సిబ్బంది మూడేళ్లుగా సచివాలయ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు.

### కోదండరామాపురంలో..

కార్వేటినగరం మండలం కోదండరామాపురం అంగన్వాడీ కేంద్ర సొంత భవన నిర్మాణం అటకెక్కింది. ఏళ్ల తరబడి నిర్మాణ పనులు పూర్తికాకుండా ఆగిపోయాయి. పనులు పూర్తి చేయించాల్సిన యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్ల అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం కలగా మారింది.

### సీడీకండ్రిగలో..

కార్వేటినగరం మండలం సీడీకండ్రిగ గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి కాలేదు. ఆ భవన నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వంలో నిధులు రాక, పనులు సాగక మధ్యలోనే నిలిచిపోయాయి.



# రూ.8లక్షల బకాయిలు ఇప్పించండి



కలెక్టర్‌ను కలిసిన మండల రైతు ఉత్పత్తిదారులు

బంగారుపాళ్యం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మ్యాంగో మార్కెటింగ్‌లో భాగంగా రైతుల నుంచి హయత్ కంపెనీ పల్ప్ ఇండస్ట్రీ తీసుకున్న మామిడి కాయల బకాయిలు రూ.8 లక్షలు ఇప్పించాలని మండల రైతు ఉత్పత్తిదారులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం బంగారుపాళ్యం మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు ఎం.నేతాజీ నాయుడు, సభ్యులు రాజేంద్ర నాయుడు, నీరజాక్షులు, తిరుమల నాయుడు తదితరులు చిత్తూరు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బకాయిల గుర్చి పలుసార్లు కంపెనీ ఎండీని కలిసినా ఆయన స్పందించడం లేదన్నారు. బకాయిలను వడ్డీతో సహా రైతు ఉత్పత్తిదారుల సంస్థకు అందించేటట్లు చొరవ చూపాలని వారు కలెక్టర్‌ను కోరారు.

# గోకులం షెడ్డు నిర్మాణాలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్

గుడిపాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్డు నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని పశు సంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 56 గోకులం షెడ్లు మంజూరయ్యాయని, ఇవి పూర్తికాగానే మరో 75 షెడ్లను మంజూరు చేస్తానని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో శివరాజు, ఉపాధి జేఈ మధు, పశు సంవర్ధక శాఖ అధికారులు సాయిసుధ, రవితేజ, ఈవోఆర్డీ కృష్ణప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

**యాదమరి:** గోకులం షెడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ ఆరిఫ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో వేణు అధ్యక్షతన పశువుల షెడ్ల నిర్మాణంపై అవగాహన పెంచేందుకు లబ్ధిదారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆసిఫ్, ఏపీవో బాల, లబ్ధిదారులు, ఉపాధి హామీ సిబ్బంది, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టుపై విచారణ జరిపించాలి: టీడీపీ

చిత్తూరు సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుత సీఎం చంద్రబాబును అరెస్టు చేసిన విధానంపై సమగ్ర విచారణ జరిపించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ డిమాండ్ చేశారు. దేశంలో సీనియర్ రాజకీయ నాయకుడు, సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసిన చంద్రబాబును ఒక కుట్ర ప్రకారం అరెస్టు చేసి జైలుకు పంపారని ఆరోపించారు. నాటి సీఎం కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్, సీఐడీ అధికారులు కలసి కుట్ర వ్యవహారం నడిపారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఈ మహా కుట్రపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## 'ఫ్యామిలీ డాక్టర్'ను వినియోగించుకోండి

గంగాధరనెల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోకి వచ్చే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌ను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, డాక్టర్ దుర్గాదేవి కోరారు. గంగాధరనెల్లూరు మండలం కలిజవేడు పంచాయతీ కె.వెంకటాపురంలో సత్యమ్మ గుడివద్ద బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో 42మంది రోగులకు పరీక్షలు చేసి, మందులు మాత్రలు పంపిణీ చేశారు. సీహెచ్‌వో శ్రీనివాసులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో

# నవజాత శిశు మరణాలు





అవగాహనర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, అధికారులు

చిత్తూరు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నవజాత శిశు మరణాలకు బాల్య వివాహాలు కూడా కారణమని డీఐవో హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక టెలిఫోన్ కాలనీ యూపీహెచ్‌సీలో జాతీయ నవజాత శిశు వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం తల్లీబిడ్డకు ప్రమాదమన్నారు. చిన్న వయసు వారికి బిడ్డను మోసే శక్తి ఉండదని, దీంతో నవజాత శిశు మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం టెలిఫోన్ కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంసీహెచ్ నోడల్ అధికారి జానకిరావు, వైద్యులు లత, ఉషశ్రీ, పల్లవి, ప్రియా, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధుడిని దర్శించుకున్న దాతలు



ఐరాల(కాణిపాకం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ పునర్నిర్మాణ దాతలు ఐకా రవి, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ బుధవారం స్వామి వారిని దర్శించుకున్నారు. వారిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేద మంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, సూపరింటెండెంట్ కోదండపాణి, సీఎఫ్‌వో నాగేశ్వరచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థీ పుస్తక పఠనం అలవర్చుకోవాలి

- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

చిత్తూరు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పుస్తకాలు మంచి నేస్తాలని, విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని విశ్రాంత ఆచార్యులు బాలక్రిష్ణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ మాట్లాడుతూ పిల్లలు నీతి కథలు చదవాలని, తద్వారా నిజాయితీని అలవరుచుకుంటారన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకుడు మునస్వామి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి లలిత, సిబ్బంది రాజ్‌కుమార్, మునీంద్ర, గుణశేఖర్, బిలాల్, పూర్ణిమ, గజేంద్రబాబు, తులసీరామ్, భాను, రాజశేఖర్, లవకుమార్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

**నగరి:** నగరి గ్రంథాలయ అధికారి గురుమూర్తి వారం రోజులుగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారంబహుమతులు, మెమెంటోలను అందించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ వేణుగోపాల్ బహుమతులను పంపిణీ చేశారు.

**పూతలపట్టు:** గత వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందినవారికి డీవైఈవో చంద్రశేఖర్ చేతులమీదుగా బహుమతులు ప్రదానంచేశారు. తహసీల్దార్ గురవప్ప, అధ్యాపకులు సత్యనారాయణ, కృష్ణమూర్తి, మనోహర్, గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బంగారుపాళ్యం:** స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం ధనుంజయ రాజు, ఉపాధ్యాయులు సుశీల, రామకృష్ణ, గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి అన్బాలగన్, అధ్యాపక బృందం హాజరయ్యారు.

- వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో విద్యార్థులకు హెచ్ఎం సిద్ధయ్య, గ్రంథాలయాధికారి మునిరాజ బహుమతులను ప్రదానం చేశారు.





పూతలపట్టులో బహుమతులు ప్రదానం చేస్తున్న చంద్రశేఖర్, నగరిలో మెమెంటోలతో విద్యార్థులు

## హైందవ శంఖారావానికి తరలిరండి



ఖండ సన్నాహక ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

చిత్తూరు కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి హిందువులు అధిక సంఖ్యలో తరలిరండి అని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి కోరారు. బుధవారం రెడ్డిగుంట దుర్గాంబ ఆలయం వద్ద ఆయన వీహెచ్‌పీ కార్యకర్తలచే ఖండా సన్నాహక సమావేశం నిర్వహించారు. విజయవాడలో జరిగే సమావేశానికి నగరం నుంచి అధిక సంఖ్యలో హిందూ సోదరులను తరలించడానికి తీసుకోవాల్సిన చర్యలపై వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామ్మూర్తి తెలియజేశారు. అనంతరం దుర్గాలయం నుంచి నగరంలో వీహెచ్‌పీ కార్యకర్తలచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ మహిళా సభ్యులు ఎ.ఎస్. అనూరాధ, ఎన్.గౌరి, ఆర్ఎస్ఎస్, భజరంగదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ గ్రీవెన్స్‌డేని సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ గ్రీవెన్స్‌డేని వినియోగదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్‌శాఖ గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌డేలో వచ్చేఅర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.

## నా భార్య ఆచూకీ తెలపండి



ఇద్దరు పిల్లలతో కలిసి మాట్లాడుతున్న రఘువర్మ

చిత్తూరు సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తన భార్య ఆచూకీ తెలపాలని బంగారుపాళ్యం మండలం తిమోజుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రఘువర్మ కోరారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం బంగారుపాళ్యం మండలం మడుపోలూరుకు చెందిన చంద్రశేఖర్ కుమార్తె బిర్లాను ప్రేమ వివాహం చేసుకున్నానని చెప్పారు. తమకు ఇద్దరు పిల్లలున్నారన్నారని, తన భార్య నాలుగు నెలలనుంచి కనిపించడంలేదని చెప్పారు. దళిత కులానికి చెందిన వ్యక్తిని కావడంతో అత్తమామలు తనపై వివక్ష చూపుతూ తమను వేరుచేయడానికి పలుమార్లు ప్రయత్నించారన్నారు. ఇప్పుడుకూడా వారు నా భార్యను కిడ్నాప్ చేశారని ఆరోపించారు. చిన్నపిల్లలు తల్లికోసం తల్లడిల్లి పోతున్నారని, ఆహారం కూడా తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులు తన అత్త, మామలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి, తన భార్యను తనకు అప్పగించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పెనుమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పెనుమూరు నుంచి చిత్తూరు వెళ్లే మార్గంలో గంగుపల్లి చెరువు వద్ద రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మండలంలోని రామాపురం దళితవాడకు చెందిన డిల్లీబాబు బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో చిత్తూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తున్న సమయంలో చీకట్లో రోడ్డుపై ఉన్న గుంతల్లో జారి పడ్డాడు. తలకు తీవ్ర గాయాలవ్వడంతో స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రోడ్డు సక్రమంగా లేనందున రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

## సస్య రక్షణతోనే అధికదిగుబడి

పెనుమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సస్య రక్షణతోనే మామిడిలో మంచి దిగుబడి వస్తుందని రాష్ట్రీయ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన పెనుమూరు బలరాం రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మామిడిలో సస్యరక్షణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



## నారా రామ్మూర్తి కుటుంబానికి పరామర్శ



రామ్మూర్తి నాయుడి చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న నాగేశ్వరచౌదరి, కుటుంబ సభ్యులు

ఐరాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన నారా రామ్మూర్తి నాయుడి కుటుంబాన్ని నారావారి పల్లెలో మద్దిపట్ల పల్లెకు చెందిన నాగేశ్వర చౌదరి కుటుంబ సభ్యులు బుధవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ రామ్మూర్తి నాయుడి కుటుంబంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రణీత్‌చౌదరి, భార్గవ్‌చౌదరి, సుప్రజ, చందు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు స్థలంలో ఇంటి తొలగింపు

వెదురుకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 239 చెరువు స్థలంలో ఆక్రమణలో ఉన్న ఇంటిని రెవెన్యూ, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పోలీసులతో కలసి బుధవారం తొలగించినట్లు వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. ఆక్రమణదారుడికి మూడు నెలల క్రితమే నోటీసు ఇచ్చామని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే తొలగించామని ఆయన చెప్పారు.

## మాల కార్పొరేషన్ సభ్యుడిగా యుగంధర్



వెదురుకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మాల కార్పొరేషన్ సభ్యుడిగా కార్వేటినగరానికి చెందిన జనసేన పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న నియమితులయ్యారు.

## శాస్త్రోక్తంగా ద్రౌపది అమ్మవారి కల్యాణోత్సవం

వెదురుకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంట ద్రౌపది సమేత ధర్మరాజులవారి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా ద్రౌపది అమ్మవారి కల్యాణోత్సవం జరిగింది. ఆలయ మహా సంప్రోక్షణలో భాగంగా కలశపూజ, మూలవర్లకు కలశస్థాపన పూజ, మహాపూర్ణాహుతి, మహా సంప్రోక్షణ నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

వెదురుకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం బెంగళూరుకు చెందిన హారిక, విజయ్ దంపతుల వితరణతో అన్నదానం చేశారు. పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు

వెదురుకుప్పం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం పంచాయతీ పెద్దపోటుజేను గ్రామంలో బుధవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి కోనేరు చెంగల్రాయ రెడ్డి, హేమశేఖర్‌రెడ్డి, జయరాంరెడ్డి, రాజశేఖర్‌వర్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

## సత్యహరిశ్చంద్ర ఆలయ పునఃప్రారంభం



చిత్తూరు కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కైలాసపురం శ్మశానంరోడ్డులో చాలా ఏళ్ల క్రితం పాడై పోయిన సత్యహరిశ్చంద్ర ఆలయానికి మరమ్మతులు చేయించి బుధవారం పునఃప్రారంభించారు. కైలాసనాథ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి రుద్రాభిషేకం, పూజలు చేశారు. అనంతరం, లక్ష్మీ హార్డ్‌వేర్, లక్ష్మీ సరస్వతి మిల్క్ డిపో ఆధ్వర్యంలో భక్తులకు, అల్పాహారం, అన్నదానం చేశారు. ఆలయం లక్ష్మణ్, జ్యోతీశ్వరన్‌ల నిర్వహణలో పునఃప్రారంభం కాగా, కార్యక్రమంలో నగరపాలక మాజీ కౌన్సిలర్లు ఆర్.రాజ, వెంకట్, జయకుమార్, సీపీఐ నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

## బడి వేళలు మార్చడం సరికాదు

నగరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బడి వేళలు మార్చడం సరికాదని, పాత పనిగంటలతోనే పాఠశాలలు పనిచేసేలా చర్యలుతీసుకోవాలని యూటీఎఫ్ కార్యదర్శి మునిరత్నం పేర్కొన్నారు. సాయంత్రం 5గంటల వరకు పనివేళలుపొడిగిస్తే టీచర్లతోబాటు విద్యార్థులు మానసికఒత్తిడికి గురవుతారన్నారు.

## యువతి కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్టు

పెనుమూరు, నవంబరు 20: ఓ యువతిని కిడ్నాప్ చేసిన కేసులో ఇద్దరు యువకులను పెనుమూరు పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం మేరకు.. నగరి మండలం చింతలపట్టెడ గ్రామానికి చెందిన ఆనంద్, ఈశ్వరిల కుమార్తె కీర్తన(20) నగరిలో ఇంటర్ చదువుతున్న సమయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న జ్యోతిసాయి అనే యువకుడు ఇన్‌స్టాగ్రాంలో పరిచయమయ్యాడు. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. అనంతరం ఆమె అక్కడ నుంచి బీఫార్మసీ కోసం పెనుమూరు మండలంలోని ఎస్వీసెట్‌లో చేరింది. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ జ్యోతిసాయి కాలేజీ వద్దకు వచ్చి తన స్నేహితుడు తరుణ్ కారులో ఆమెను బెంగళూరు తీసుకెళ్లారు. యువతి హాస్టల్‌లో లేకపోవడంతో నిర్వాహకులు ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అదే రోజు రాత్రి 8 గంటలకు పెనుమూరు పోలీసు స్టేషన్‌లో తమ కుమార్తె కనబడటం లేదని ఫిర్యాదుచేశారు. సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు స్పెషల్ టీం దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలో 17వ తేదీ సాయంత్రం జ్యోతిసాయి ఆ యువతిని చిత్తూరు బస్టాండులో వదిలిపెట్టి వెళ్లిపోయాడు. ఆమె కుటుంబ సభ్యులకు బస్టాండులో ఉన్నానని సమాచారం ఇవ్వగా వాళ్లువచ్చి ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం ఆమెను పోలీసులు పిలిచి విచారించగా, తనను జ్యోతిసాయి, అతడి స్నేహితుడు తరుణ్ ఇద్దరూ కిడ్నాప్ చేశారని స్టేట్‌మెంట్ ఇవ్వడంతో వారిద్దరిపై పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అనంతరం వారి కోసం గాలిస్తున్న పోలీసులకు 19వ తేదీ సాయంత్రం పెనుమూరు మండలం పైపల్లి వద్ద ఉన్నారని సమాచారం అందింది. పోలీసులు అక్కడకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని, ఇద్దరిని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

## ఎంపీ నిధులతో హాస్టల్ భవనానికి మరమ్మతులు



బాలికల ఎస్సీ హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ దుర్గాదేవి

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

గంగాధరనెల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఎంపీ ల్యాండ్స్ ద్వారా గంగాధరనెల్లూరు బాలికల హాస్టల్‌లోని భవనాల మోల్డింగ్‌తో పాటు ఇతరత్రా మరమ్మతులు చేయడానికి రూ.5లక్షలు మంజూరైనట్లు ఏఎస్‌డబ్ల్యువో షకీలా తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో అమ్మో.. తలలు పగులుతాయేమో అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై ఎంపీడీవో హరిప్రసాదరెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి బుధవారం హాస్టల్ భవనంలోనిగదులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు ఏఎస్‌డబ్ల్యువో షకీలా, వార్డెన్ రమాదేవితో ఫోన్‌లో మాట్లాడి హాస్టల్ భవనం గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ భవనంలో మరమ్మతులు చేయించడానికి ఎంపీ ల్యాండ్స్‌ద్వారా రూ.5లక్షలువిడుదలయ్యాయని ఏఎస్‌డబ్ల్యువో చెప్పారు. పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు రానీయొద్దని ఇంజనీరింగ్ అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. సీహెచ్‌వో శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడి మృతి

పెనుమూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం గుట్టకిందపల్లికి చెందిన సీనియర్ పాత్రికేయుడు శివశంకర్(55) బుధవారం వేకువజామున 3 గంటలకు గుండెపోటుతో మృతి చెందారు.

## దాడిలో గాయపడ్డ టీడీపీ కార్యకర్త మృతి



కృష్ణమూర్తి (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త కృష్ణమూర్తి (50) బుధవారం మృతిచెందాడు. బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... దండువారిపల్లె గ్రామానికి చెందిన కృష్ణమూర్తిని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని కొత్తపల్లి ఫ్లైఓవర్ సమీపంలోని ఓ మామిడి తోటలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టి పడేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు తెలియజేసి ఆయన్ను రాణిపేట సీఎంసీలో చికిత్స కోసం చేర్పించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణమూర్తి బుధవారం మృతి చెందినట్లు సీఐ చెప్పారు. ఆయనపై దాడి చేసిన నిందితులను పట్టుకోవడానికి జాతీయ రహదారిలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని అన్నారు. కృష్ణమూర్తి మృతి పట్ల మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కమల్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండ్రోజుల క్రితం వరకు పార్టీ సభ్యత్వ నమోదులో కీలకంగా పనిచేశారని తెలిపారు. అతడి కుటుంబానికి రూ.25వేలు ఆర్థికసాయం చేశారు.

## వైన్‌షాపు సేల్స్‌మాన్‌పై దాడి

చిత్తూరు అర్బన్, నవంబరు 20: మద్యంషాపు ముందు ఘర్షణ పడుతున్న యువకులకు సర్దిచెప్పిన సేల్స్‌మాన్‌పై దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు... నగరానికి చెందిన అజిత్, కుమార్, అనిల్ దర్గా వద్ద ఉన్నసుకుమార్ వైన్‌షాపులో మద్యంసేవించడానికి వచ్చారు. మద్యంతీసుకుని పక్కనేఉన్న గదిలో పెద్దఎత్తున అరుస్తూ తాగడం ప్రారంభించారు. సేల్స్‌మాన్‌గా ఉన్న రవికుమార్ అక్కడ అరవకూడదని సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. దాంతో అతడిపై వాగ్వివాదానికి దిగి దాడి చేయడంతో భయపడి షాపులోకి వెళ్లి గేటువేసుకున్నా బయటనుంచి రాళ్లతో దాడిచేశారు. రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## లారీ బోల్తా - డ్రైవర్‌కు గాయాలు

గుడిపాల, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిలో బుధవారం రాత్రి రైల్వే బ్రిడ్జి వద్ద లారీ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన పళని తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాసనపల్లెలో సారా స్థావరాలపై దాడులు

గుడిపాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాసనపల్లె అటవీ ప్రాంతంలో బుధవారం గుడిపాల పోలీసులు దాడులు నిర్వహించారు. సారా తయారు చేసే స్థావరాలపై దాడులు నిర్వహించి 800 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో పడిగట్ల పూజ

గుడిపాల, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపసముద్రం, వసంతాపురం, కొత్తపల్లి గ్రామాల్లో పలు గ్రామాల్లో అయ్యప్ప భక్తులు పడిగట్ల పూజను బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.చుట్టుపక్కల అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.